సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



మన పులులు లెక్కల్లో లేవు!

కేంద్ర అటవీ పర్యావరణ శాఖ విడుదల చేసిన నివేదికలో కవ్వాల్‌లో ఒక్క పులి కూడా లేనట్లుగా చూపారు. కారిడార్‌లో సంచరించే బెబ్బులను పరిగణనలోకి తీసుకోలేదు. 10లో▸



కిలో టమాటా రూ.200

దండేపల్లి: టమాటా ధర రోజు రోజుకు పెరుగుతోంది. సోమవారం దండేపల్లి వారసంతలో కిలో టమాటా ధర రూ.200 పలికింది. మొన్నటి వరకు రూ.150 నుంచి రూ.160 ఉండగా ఈ వారం కిలోకు రూ.40 నుంచి రూ.50 అదనంగా పెరగడంతో అవాక్కయ్యారు.

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది.

పోటెత్తిన వరద



ఇటీవల ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద

- సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నీరు
- జలాశయాల సామర్థ్యానికి మించి ఇన్‌ఫ్లో
- ప్రధాన ప్రాజెక్టుల నుంచి దిగువకు 243 టీఎంసీలకు పైగా విడుదల

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తింది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరద చేరడంతో ఆయకట్టుకు ఢోకా లేకుండా పోయింది. ఈ వానాకాలం ఆరంభంలో వర్షాలు కురుస్తాయా? లేవా ? అనే సందేహం తలెత్తింది. జూన్ రెండో వారం నుంచి మొదలై జూలై మూడో వారం వరకు కూడా కొన్ని మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. అన్నదాతలు విత్తనాలు వేసి వరుణుడి వైపు చూశారు. జూలై మూడో వారం నుంచి క్రమంగా వర్షాలు ముసురుగా మొదలై ఎడతెరపి లేకుండా కుండపోతగా కురిసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. పూర్తి స్థాయిలో నిండడమే కాకుండా ఒక్కో ప్రాజెక్టు సామర్థ్యం మించి వరదను దిగువకు విడుదల చేశాయి. దీంతో అటు గోదావరి, ఉపనది, ఇతర వాగులు, వంకలపై నిర్మించిన మధ్యతరహా ప్రాజెక్టుల్లోనూ భారీగా నీరు చేరింది. ఒక్కో సాగునీటి ప్రాజెక్టుకు వాటి సామర్థ్యం కన్నా అనేక రేట్లు ఎక్కువగా నీటిని దిగువకు విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నుంచి 243టీఎంసీల కన్నా అధికంగానే నీరు దిగువకు వెళ్లిపోయింది. ప్రధాన ప్రాజెక్టుల వివరాలు పరిశీలిస్తే ఇలా ఉన్నాయి.

'కుమురం భీం'కు భారీగా..

ఆసిఫాబాద్ మండలం అడ వద్ద నిర్మించిన కుమురంభీం ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 10టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.461టీఎంసీల నిల్వ ఉంది. ఈ సీజన్‌లో అత్యధికంగా 59వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ఆ సమయంలో అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి 60వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు.

మధ్య తరహా ప్రాజెక్టుల్లోనూ

ఉమ్మడి జిల్లాలో ఉన్న మధ్యతరహా ప్రాజెక్టులైన వట్టివాగు, గడ్డెన్నవాగు, స్వర్ణ, సాత్నాల వంటి ప్రాజెక్టులకు సైతం గత వారం కురిసిన వర్షాలకు భారీగా వరద పోటెత్తింది. ఒక్కో ప్రాజెక్టుకు రెండు, మూడు రెట్లు అధికంగా ఇన్‌ఫ్లో ఉంది. అంతే మొత్తంలో అవుట్ ఫ్లోగా నమోదైంది. వానాకాలం ఆరంభం లోనే ఈ స్థాయిలో వర్షాలు పడ్డాయి. వచ్చే సెప్టెంబర్ వరకు రుతు పవనాల ప్రభావం ఉండనుంది. దీంతో మళ్లీ అధిక వర్షాలు కురిస్తే ప్రాజక్టులకు మళ్లీ వరద ఉధృతి ఉండనుంది.

ఎల్లంపల్లికి భారీగా ఇన్‌ఫ్లో

గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థామర్థ్యం 20టీఎంసీలు. వరుసగా కురిసిన వర్షాలతో ఈ నెల 28న మొత్తం 62 గేట్లలో 47గేట్లు ఎత్తి ఈ సీజన్‌లోనే ఇప్పటివరకు గరిష్టంగా 9.32లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ సమయంలో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 9.02లక్షలుగా ఉంది. దీంతో గోదావరి దిగువకు భారీగా నీటిని విడుదల చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 197టీఎంసీల వరద రాగా, 185టీఎంసీల నీటిని వరద గేట్లు ఎత్తి విడుదల చేశారు. వర్షాలు తగ్గాక క్రమంగా వరద తగ్గడంతో గేట్ల ఎత్తివేతను అధికారులు ఆపేశారు. ఒక దశలో మంచిర్యాల పట్టణం తోపాటు పరీవాహక ప్రాంతమంతా హై అలర్ట్‌తో ఉండాల్సి వచ్చింది. ఇక హైదరాబాద్‌కు తాగునీటికి, ప్రాజెక్టు నుంచి అవసరం మేరకు నీటిని విడుదల చేస్తున్నారు.

జూన్ 1నుంచి జూలై 31వరకు మొత్తం ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	సామర్థ్యం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో	ప్రస్తుతం
ఎల్లంపల్లి	20	197.904	185.020	16.66
కుమురంభీం	10	8.063	8.41041	5.461
కడెం	7.603	40.351	38.099	4.932
వట్టివాగు	2.89	1.7618	1.049	2.201
గడ్డెన్నవాగు	1.852	6.681	5.967	1.476
స్వర్ణ	1.484	4.42	3.4	0.946
సాత్నాల	1.240	2.737	1.970	0.844

కడెం గేట్లపై నుంచి..



ఇటీవల వర్షాలకు గేట్లపై నుంచి వరద

కడెం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం700(7.603టీఎంసీ)అడుగులు, కానీ ప్రాజెక్ట్‌లో మూడు టీఎంసీలకు పైగా పూడిక పేరుకుపోయింది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం 4 టీఎంసీలకే పరిమితమైంది. వానాకాలం పంటలకే చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో సాగు నీటిని విడుదల చేస్తున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురిస్తే యాసంగి పంటలకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. అది కూడా వారబందీ పద్ధతిన 25వ డిస్ట్రిబ్యూటరీ వరకే. దీంతో చివరి ఆయకట్టు వరకు కడెం నీరందని పరిస్థితి ఉంది. జూలై 13న కడెం ప్రాజెక్ట్‌కు వచ్చిన ఇన్‌ఫ్లో 1 టీఎంసీ మాత్రమే కాగా.. అది 21వరకు 4 టీఎంసీలకు చేరింది. జూలై 30 వరకు అది 40 టీఎంసీలకు పెరిగింది. అంటే కేవలం 17 రోజుల్లోనే కడెం ప్రాజెక్ట్‌కు 40 టీఎంసీల నీళ్లు వచ్చాయి. నీటి నిల్వ సామర్థ్యం లేక.. కడెం ప్రాజెక్టు ఆరు రేట్ల నీళ్లు సముద్రం పాలయ్యాయి. ప్రాజెక్టు గేట్ల పైనుంచి నీళ్లు ఉరకలెత్తాయి.



కుమురం భీం ప్రాజెక్టు(ఫైల్)

నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

నస్పూర్: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఫ్లడ్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితం నాశనం చేసుకోవద్దని అన్నారు. ఉద్యోగాల సాధనకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు నమ్మవద్దని తెలిపారు. మహిళల భద్రత పోలీసుల లక్ష్యమని, మహిళలు, యువతులు, చిన్న పిల్లలతో మర్యాదగా ప్రవర్తించాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, మంచిర్యాల పట్టణ సీఐ రాజు, సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్, అదనపు ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలో అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కేజీబీవీ, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ప్రతీ పాఠశాలలో పారిశుధ్య కార్మికులను నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా బాధ్యులు సత్తిరెడ్డి, రాజ్యలక్ష్మీ, నగేష్, సందీప్, రాజ్‌కుమార్, పీవీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కొత్త వ్యక్తులు, నేరస్తుల సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు ఇళ్లలో షెల్టర్ తీసుకుంటే వెంటనే పోలీసులకు సమాచా రం ఇవ్వాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సద య్య అన్నారు. సోమవారం బెల్లంపల్లి టూటౌన్ పరిధి లోని సుభాష్‌నగర్ బస్తీలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు చేశా రు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 55 మోటారుసైకిళ్ల, 11ఆటోరిక్షాలు, రెండు కార్లు సీజ్ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదయ్య మాట్లాడుతూ నేరాల నిర్మూలనకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం బస్తీ యువకులకు ఏసీపీ వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్, వన్‌టౌన్ ఎస్‌హెచ్ఓ టి.శంకరయ్య, ఎస్సైలు రవికుమార్, ప్రవీణ్‌కుమార్, రమేష్, శ్యామ్ పటేల్, 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించాలి

భీమిని: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. సోమవారం కన్నెపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పాతనేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. తాండూర్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

బీజేపీలో మాజీ ఎమ్మెల్యేల చేరిక



బీజేపీలో చేరిన శ్రీదేవి, సంజీవరావు

బెల్లంపల్లి: ముందస్తు ప్రచారం జరిగినట్లుగానే జిల్లా నుంచి ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. సోమవారం హైదరాబాద్ కేంద్రంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంపల్లి, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యేలు అమురాల శ్రీదేవి, సొత్కు సంజీవరావు ఆ పార్టీలో చేరారు. వీరికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్, జాతీయ నాయకురాలు డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.రఘునాథ్ సమక్షంలో ఇరువురు కమలదళంలో చేరారు. మాజీ ఎమ్మెల్యేల చేరికతో ఆయా నియోజకవర్గాల కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

కాంగ్రెస్ నాయకుల వినూత్న నిరసన



కేసీఆర్ ఫొటోకు పిండప్రదానం

చెన్నూర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు మండలంలోని సుందరసాల గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో గోదావరి పరీవాహక ప్రాంతాలు ముంపునకు గరవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఎం కేసీఆర్ ఫొటోకు పిండ ప్రదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

మూత్రశాల కూల్చివేతపై ఆందోళన



మూత్రశాలను కూల్చిన మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులు సొంత ఖర్చుతో చేపట్టిన మూత్రశాల నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు సోమవారం కూల్చివేశారు. దీంతో వ్యాపారులు మూకుమ్మడిగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేశారు. అధికార పార్టీకి చెందిన వారు అధికారులపై ఒత్తిడి తెచ్చి కూల్చి వేయించినట్లు ఆరోపించారు. కమిషనర్ మారుతిప్రసాద్‌ను వివరణ కోరగా, మార్కెట్‌కు సమీపంలో మూత్రశాలలు ఉన్నాయని, నిర్వాహకులతో మాట్లాడి డబ్బుల చెల్లింపు విషయంలో మినహాయింపు ఇచ్చేలా చూస్తామని చెప్పారు. అనుమతి తీసుకోకపోవడం వల్లనే పనులు అడ్డుకున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్: ప్రజావాణి కార్యాక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతీలాల్‌లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 50 దరఖాస్తులు వచ్చాయని, ప్రతీ దరఖాస్తును పరిశీలించి సంబంధిత అధికారులు పరిష్కరించాలని తెలిపారు.

- జీవనోపాధి కోసం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంజూరు చేసిన రూ.50వేల విలువైన చెక్కులు అందజేశారని, డబ్బులు ఇప్పటికీ రాలేదని ట్రాన్స్‌జెండర్లు లఖ్లీ, లిప్సిక, రోజా కోరారు.
- మంచిర్యాల పట్టణంలో అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు కోరారు.
- రైలు ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు పింఛన్ ఇప్పించాలని మంచిర్యాలకు చెందిన టేకు పవన్ కోరాడు.
- మావోయిస్టుగా లొంగిపోయినందున ప్రభుత్వం తనకు కేటాయించిన రెండు గుంటల స్థలంలో గురుకుల వసతి గృహం నిర్మించారని, వేరేచోట ఇంటి స్థలం కేటాయించాలని కోటపల్లి మండలం దేవులవాడ గ్రామానికి చెందిన అసరెల్లి సమ్మయ్య కోరాడు.

పింఛన్ ఇప్పించండి



మా కుమారుడు శీమాన్(6)కు పుట్టినప్పటి నుంచి రెండు కాళ్లు పని చేయడం లేదు. నాలుగేళ్ల క్రితం వంద శాతం దివ్యాంగుడని సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పటికీ పింఛన్ రావడం లేదు. మా బాబుకు పింఛన్ మంజూరు చేయాలి.
– గంధం దేవేందర్, ప్రణీత, మంచిర్యాల

పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నాలో సిబ్బంది, నాయకులు

పంచాయతీ కార్మికులు, సిబ్బంది డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాతరాజు మురళీధర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని పర్మినెంటు చేయాలని, కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాల పెంపు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బ్యాక్‌వాటర్ ముంపు నుంచి కాపాడండి



ధర్నా చేస్తున్న నస్పూర్ ముంపు ప్రాంతాల ప్రజలు

గోదావరి బ్యాక్‌వాటర్ ముంపు నుంచి ఆదుకోవాలని నస్పూర్‌కు చెందిన పలువురు ముంపు ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రతీ వర్షాకాలం తోళ్లవాగు వరద నీరు ఇళ్లలోకి చేరుతోందని, దీంతో తాము నిరాశ్రయులం అవుతున్నామని తెలిపారు. తోళ్లవాగు చుట్టుపక్కల కరకట్ట నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శీపతి మల్లేశ్, రాజేందర్, తాజొద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి



ధర్నా చేస్తున్న రాపల్లి గ్రామస్తులు

హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులకు 1989లో అప్పటి ప్రభుత్వం గుడిపేట శివారు సర్వేనంబరు 294లోని 11 ఎకరాల స్థలంలో 44 మందికి 10 గుంటల చొప్పున స్థలం కేటాయించిందని, ప్రస్తుతం ధరణిలో నమోదు కాలేదని రైతులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కొందరు ఇటుక బట్టీల యజమానులు ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ధరణిలో నమోదు చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చిప్పకుర్తి ఐలయ్య, తిరుపతి, లింగయ్య, సంజీవ్, చెన్నూరి సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలక

- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి
- వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమంటున్న వైద్యులు



మంచిర్యాలటౌన్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో పలు వైరస్‌లు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ప్రజలకు కళ్ల కలక వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతోంది. అంటువ్యాధి కావడం, కళ్ల కలక వచ్చిన వారి కళ్లల్లోకి చూసినా, వారు వినియోగించిన వస్తువులను తాకడం, వాడడం చేసినా వెంటనే మరొకరికి వ్యాపిస్తుంది. భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండగా, కళ్ల కలక కూడా జత కావడంతో ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఎపిడమిక్స్ ఆఫ్ ఎడినో వైరల్ ద్వారానే ఈ కళ్ల కలకలు వస్తుండగా, దానిని గుర్తించేలోపే ఒకరి నుంచి మరొకరికి సోకుతున్నట్లు కంటి వైద్యులు చెబుతున్నారు. గత వారం రోజుల నుంచే దీని ప్రభావం జిల్లాలో ఎక్కువ కాగా, ఇన్నాళ్లు విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడం కలిసొచ్చింది. గురుకులాలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులంతా కలిసి ఉండడం వల్ల జిల్లాలోని జైపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు కళ్ల కలక బారిన పడ్డారు. సోమవారం నుంచి అన్ని విద్యాసంస్థలు తిరిగి ప్రారంభం కావడంతో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తరచూ చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం, కళ్ల కలక వచ్చిన వారు ఉంటే వారి కళ్లల్లోకి నేరుగా చూడకుండా ఉండడం చేయాలని చెబుతున్నారు.

జాగ్రత్తలతోనే దూరం

అపరిశుభ్ర వాతావరణం వల్లనే పలు రకాల వైరస్‌లు ప్రజలకు వ్యాధులను తెచ్చి పెడుతుంటాయని, అందులో భాగంగానే కళ్ల కలక కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దుమ్ము, ధూళి వంటివి కళ్లల్లో పడినప్పుడు అందులో నుంచి వచ్చే ఎడినోవైరల్ ద్వారా కళ్ల కలక వస్తుంటాయి. గతంలో అక్కడక్కడా కళ్ల కలక కనిపించగా, ఇప్పుడు ప్రతీ పది మందిలో ఒకరు దీనిబారిన పడుతున్నారు. కళ్ల కలక వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందని, చిన్న పిల్లలకు ఇది ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు.

జాగ్రత్తలు..

- వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచనల మేరకు యాంటీబయోటిక్ ఐడ్రాప్స్, స్టిరాయిడ్ ఐ డ్రాప్స్, లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.
- ఇతరులు ముందు జాగ్రత్త కోసం సేఫ్టీ గ్లాసెస్‌ను వినియోగించడం మంచిది.
- చేతులను శుభ్రం చేసుకోకుండా కళ్లను తాకినప్పుడు బ్యాక్టీ?యా లోనికి చేరి కళ్ల కలక బారిన పడతారు.
- కండ్ల నుంచి కారే నీటిని, స్రావాన్ని శుభ్రమైన తడిబట్టలతో శుభ్రపరచాలి.
- చేతులను తరచూ సబ్బుతో శుభ్రపరుచుకోవాలి.
- ఉతికిన టవల్స్, కర్చీఫ్‌లను మాత్రమే వినియోగించాలి.
- కళ్ల కలక ఉంటే తగ్గే వరకు కళ్లజోడు పెట్టుకోవాలి. ఇంట్లో ఎవరికైనా కళ్ల కలక వస్తే, ఇంట్లోని వారు సేఫ్టీ కళ్లజోడును ధరిస్తే మంచిది.

అంటువ్యాధి



కళ్ల కలక అనేది ఇప్పుడు ఎక్కువగా వస్తోంది. ఇది సాధారణమైన వ్యాధినే. ఇది అంటువ్యాధి కావడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స తీసుకోవాలి. ఒక్కసారి వైరస్ వ్యాధి వ్యాపిస్తే నయం అయ్యేందుకు వారం రోజులు పడుతుంది. వ్యాధి వచ్చిన వారు చికిత్స తీసుకుంటూనే, బయటకు రాకుండా ఉండాలి. యాంటీ బయోటిక్ ఐడ్రాప్స్ వేసుకుంటూ, అవసరాన్ని బట్టి మందులు వేసుకోవాల్సి వస్తుంది. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. వారికి సోకితే వెంటనే చికిత్స అందించాలి.
– డాక్టర్ యశ్వంత్, ప్రభుత్వ కంటి వైద్యాధికారి, మంచిర్యాల

ఈసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో సోమవారం ఈసెట్–2023 కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కౌన్సెలింగ్‌కు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వరుస క్రమంగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేసి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 259 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి కౌన్సెలింగ్ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేశారు. తొలిరోజు సవ్యంగా జరిగినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

రైతును కరిచిన కుక్క



గాయం చూపిస్తున్న జాదవ్ భీంరావు

కెరమెరి: మండలంలోని లక్మాపూర్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ భీంరావును సోమవారం కుక్క కరవడంతో కాలికి తీవ్ర గాయమైంది. గ్రామంలోని అంతర్గత రోడ్డుపై నడుస్తుండగా అకస్మాత్తుగా కుక్క మీద పడి కరిచింది. ఆస్పత్రికి వెళ్లే దారి మధ్యలో పెద్ద వాగు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో బాధితుడు ఇంట్లోనే ప్రథమ చికిత్స చేసుకున్నట్లు తెలిసింది.

'నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలి'

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని పర్శనంబాల ప్రభుత్వ పాఠశాలలో నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలని కోరుతూ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం దేవాజీ, ఉపాధ్యాయులు సోమవారం ఎంఈవో మనుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కుమార్ 2022–23 విద్యా సంవత్సరంలో సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్)లో భాగంగా జూలై 10, 2023న పర్శనంబాల నుంచి బూర్గుడ ఉన్నత పాఠశాలకు వెళ్లగా ఇన్‌చార్జి బాధ్యతలు దేవాజీకి అప్పగించినట్లు తెలిపారు. జూలై 21, 2023న రూ.6,700, జూలై 27న రూ.10 వేలు విత్‌డ్రా చేసి పాఠశాలకు ఆటవస్తువులు కొనుగోలు చేయకుండానే చేసినట్లు చూపించి గోల్‌మాల్ చేసినట్లు వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

జైపూర్(చెన్నూర్): మండలంలోని మంచిర్యాల–చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారిలో గల దుబ్బపల్లి బస్టాండ్‌లో సోమవారం గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మృతుని వయస్సు 65 నుంచి 70 సంవత్సరాలు ఉంటుందని, అతని శరీరంపై లేత ఆకుపచ్చ రంగు గడుల షర్టు, తెలుపు రంగు లుంగీ కట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గుర్తించిన వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని కోరారు.

విధుల్లో చేరిన పారిశుధ్య కార్మికులు



జన్కాపూర్‌లో విధుల్లో చేరిన కార్మికులు

భీమిని: తమ సమస్యల పరిష్కారానికి నెల రోజులుగా సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు స్వచ్ఛందంగా సోమవారం పనుల్లో చేరారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పారిశుధ్య కార్మికులు విధుల్లో చేరి పనుల్లో నిమగ్నమయ్యారు. పారిశుధ్య కార్మికులు తమ ఇష్టపూర్వకంగా పనుల్లో చేరుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులకు తెలిపారు. భీమిని మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో 37 మంది, కన్నెపల్లి మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 45 మంది కార్మికులు విధుల్లో చేరారు.

కాటేస్తే కాటికే..!



మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన తొర్రం సాన్విక(5) అనే బాలిక కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం రెబ్బెనలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. జూలై 4న ఆరు బయట ఆడుకుంటుండగా చిన్నారిని పాము కాటు వేసింది. చిన్నారి కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆడుకుంటూ ఐదేళ్ల చిన్నారి అనంతలోకాలకు వెళ్లడంతో రెబ్బెనతో పాటు మెట్‌పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



- సకాలంలో చికిత్స అందక పెరుగుతున్న పాముకాటు మరణాలు
- నాటు వైద్యంతో ప్రాణహాని • పల్లెల్లో అవగాహన కల్పించని అధికారులు
- జూలైలో నలుగురు మృతి

కౌటాల(సిర్పూర్): జోరుగా వానలు కురుస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలను వరద ముంచెత్తుతోంది. ఈ క్రమంలో విషపురుగులు గృహాల మధ్యకు చేరుతున్నాయి. విషపురుగుల కాటు మరణాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. పాములు, తేళ్లు కాటు వేసినప్పుడు కంగారు పడకుండా జాగ్రత్తలతో వైద్యం తీసుకుంటే సురక్షితంగా బయటపడవచ్చని వైద్యులు చెబుతున్నారు. కుమురంభీం జిల్లాలో రెండేళ్లలో 140 మందికి పైగా పాము కాటుకు గురయ్యారు. ఈ ఏడాది ఇప్పటి వరకు పదుల సంఖ్యలో పాము కాటు బాధితులు ఉన్నారు.

అవగాహన లేమి.. నాటు వైద్యంతో హాని

మారుమూల గ్రామాల్లోని చాలా మందికి ఇప్పటికీ పాముకాటుపై సరైన అవగాహన లేదు. ఆధునిక కాలంలోనూ గిరిజనులు, గ్రామీణ ప్రజలు నాటువైద్యాన్ని నమ్ముకుంటున్నారు. విషపురుగులు కాటు వేసినప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పీహెచ్‌సీల్లో విరుగుడు మందులు అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నా సకాలంలో చికిత్స అందక మరణాలు చోటు చేసుకుంటున్నాయి. అప్రమత్తత, అవగాహన లేకపోవడంతోనే నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. క్రిమికీటకాలపై అధికార యంత్రాగం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదనే అపవాదు ఉంది.

ఇటీవలి ఘటనలు

- జూలై 2న కౌటాల మండలం కనికి గ్రామంలో ఓ ఇంట్లో పాము దూరింది. దానిని పట్టేందుకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన నాయిని రమేశ్(40)ను పాము కాటేయడంతో ప్రాణాలొదిలాడు. సకాలంలో వైద్యం అందక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
- జూలై 9న సిర్పూర్(యూ) మండలం ఖాతిగూడ గ్రామానికి చెందిన సెడ్మకి జగన్నాథ్‌రావు (35) చేనులో పని చేస్తుండగా పాముకాటు వేసింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నాటువైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో మరుసటి రోజు మృతి చెందాడు.
- జూలై 16న చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన లోడెల్లి లలిత(53) జూలై 16న కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. పాము కాటు వేయడంతో సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఆలస్యమైతే ప్రాణాలకు ప్రమాదం..

సాధారణంగా పాములు ఆత్మరక్షణ కోసమే మనుషులను కాటు వేస్తాయి. అలాగే అన్ని పాముల్లో విషం ఉండదు. తాచు, కట్ల పాముల వంటి 15 సర్ప జాతులతోనే ప్రమాదం పొంచి ఉంది. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషంలేని, ప్రమాదం లేని మామూలు గాయాలే. వీటికి సాధారణ చికిత్స తీసుకుంటే చాలు. పాము కాటు వేసిన సమయంలో ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవడం ఉత్తమం. నాటువైద్యం తీసుకుని చికిత్స ఆలస్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం ఏర్పడవచ్చు.

అప్రమత్తత అవసరం..

- ధాన్యం నిల్వ చేసే ప్రదేశాలు, గడ్డి వాములు ఉండే చోట ఎలుకల సంచారం ఎక్కువగా ఉంటుంది. తడిగా ఉండే చోటుకి కప్పలు చేరతాయి. వాటిని వేటాడేందుకు పాములు వచ్చే అవకాశం ఉంది.
- నెలల తరబడి ఒకేచోట ఉండే దుంగల మధ్య పాములు, తేళ్ల వంటి విష పురుగులు నివాసం ఉంటాయి.
- రాత్రిపూట పొలాలకు మోటారు వేసేందుకు, కాపలాకు వెళ్లే రైతులు విధిగా టార్చిలైట్ ఉపయోగించాలి. స్టార్టర్ బాక్సుల్లో కూడా పాములు నక్కి ఉండవచ్చు.
- పొలం గట్ల వెంబడి చప్పుడు చేస్తూ నడవడం మంచిది. కాళ్లకు షూలు ధరించడం ద్వారా పాముకాటు నుంచి తప్పించుకోవచ్చు.
- పాములు దూరేందుకు అవకాశం లేకుండా ఇంటి పరిసరాలను నిత్యం శుభ్రం చేసుకోవాలి.

మందులు ఉన్నాయి



వర్షాకాలంలో చిత్తడిగా ఉండే ప్రదేశాల్లో పనిచేస్తుండగా పాము, తేళ్లు కాటేస్తాయి. బాధితులకు నాటువైద్యం చేయిస్తే ప్రాణాలకే ప్రమాదం. అన్ని ప్రభుత్వ ఆస్పతుల్లో యాంటి స్నేక్ వీనమ్ అందుబాటులో ఉంది. విషపురుగులు కరిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి సరైన చికిత్స అందిస్తే ప్రాణాపాయం ఉండదు. – రామకృష్ణ, డీఎంహెచ్‌వో, కుమురంభీం జిల్లా

జాతీయ నృత్య పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో మాస్టర్

జన్నారం: డీడీ టీవీ చానల్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో సౌత్‌జోన్ నుంచి స్లేట్ హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు, నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు ఆరుగురు మొత్తం తొమ్మిది మంది ఎంపికైనట్లు కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్, మాస్టర్ నర్మదగౌడ్ తెలిపారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

విశ్రాంత ఉద్యోగులు ధ్రువపత్రాలు అందజేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణరావు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని విశ్రాంత ఉద్యోగులంతా ధ్రువపత్రాలు ఇవ్వాలని ఏరియా పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు సూచించారు. సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగి మరణిస్తే నామినీకి పెన్షన్ అందించడంలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సీఎంపీఎఫ్ రీజియనల్ కమిషనర్ ఆదేశాల మేరకు పెన్షన్ పొందుతున్న ప్రతి ఉద్యోగి, అతని భార్య బ్యాంకు అకౌంట్‌ను ఫార్మర్ లేదా సర్వైవర్ మోడ్ లోకి మార్చుకోవాలన్నారు. సీపీఆర్‌ఎంఎస్ కార్డు జిరాక్స్ పత్రాలతో పాటు మూడు జాయింట్ పాస్ ఫొటోలను మైన్స్, డిపార్టుమెంట్లలో అందజేయాలన్నారు.

గురుకులాన్ని సందర్శించిన సివిల్ కోర్టు జడ్జి

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న జడ్జి సంపత్‌కుమార్

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో వారం రోజులుగా విద్యార్థులు కళ్లకలక వ్యాధితో బాధపడుతున్నారు. సోమవారం 'గురుకులంలో కళ్లకలక కలవరం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కోర్టు జడ్జి ప్రభాకర్‌రావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి సంపత్ కుమార్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గురుకులాల ఆర్సీవో స్వరూపరాణి, ఆర్‌ఎం భీష్మ, స్థానిక వైద్యాధికారి అనిల్‌రావు, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎస్సై ఉపేందర్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలభాస్కర్, తదితరులు ఉన్నారు.

ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న బానేష్

తాండూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి కొండు బానేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మాదారం 5 ఇంక్లైన్ గ్రామంలో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు పొలాల్లో ఇసుక, మట్టి మేటలు వేయడం, వరద ప్రవాహానికి పంట కొట్టుకు పోవడం, రోజుల తరబడి నీట మునిగి ఉండడంతో పత్తి, సోయాబీన్, కంది పంటలు కుళ్లిపోయి భారీగా నష్టం వాటిల్లిందన్నారు. గ్రామాల వారీగా వ్యవసాయ అధికారులు సమగ్రంగా పంట నష్టం సర్వే చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి ఎడ్ల గోపాల్, రైతులు లక్ష్మీ, తిరుపతిరావు, హంస, రాంచందర్‌రావు, వనిత, బరికురావ్, లత, శ్రావణ్‌కుమార్, శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకే కాలయముడు

- రోకలితో మోది తండ్రిని హత్యచేసిన తనయుడు
- మద్యం మత్తులో ఘటన
- నదిమాబాద్‌లో దారుణం



పర్వతాలు(ఫైల్)

కౌటాల(సిర్పూర్): మద్యం మత్తులో జరిగిన తగవు ఓ ప్రాణాన్ని బలితీసుకుంది. తండ్రీకొడుకుల మధ్య జరిగిన గొడవలో కన్నతండ్రినే కుమారుడు రోకలితో మోది హత్యచేసిన ఘటన కౌటాల మండల కేంద్రంలోని నదిమాబాద్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన పంబాల పర్వతాలు (51) పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి కుమారుడు రవి, కుమార్తె స్వప్న సంతానం. రవి మద్యానికి బానిస కావడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా పర్వతాలు ఇటీవల గేదెను కొనుగోలు చేశాడు. సోమవారం తండ్రి ఇంట్లో లేని సమయంలో రవి గేదెను తీసుకెళ్లి సంతలో విక్రయించాడు. వచ్చిన డబ్బులతోనే మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న తండ్రి కుమారుడిని నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న రవి విచక్షణ కోల్పోయి తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. వంటగదిలో ఉన్న రోకలితో తండ్రి తలపై బాదడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రవిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలాన్ని కౌటాల సీఐ సాదిక్ పాషా పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య వెంకక్క ఉన్నారు.

అర్హులకు దళితబంధు మంజూరు చేయాలి

పాతమంచిర్యాల: అర్హులైన దళితులకు దళితబంధు పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి దేవి పోచన్న ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అసిస్టెంట్ కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ నాయకుల జోక్యం లేకుండా కలెక్టర్ లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న దళితులకు జీవో 58,59 ప్రకారం పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రవి, నాయకులు దాగం మల్లేశ్, జాడి పోచన్న, బి.లక్ష్మీనారాయణ, బాబు, లక్ష్మణ్, తిలక్, స్వామిదాస్, భరత్, శంకర్, యోసేపు, రాజేష్, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు శాలసిద్ధి

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు సమ్మిళిత విద్యబోధన అభ్యసన మదింపునకు ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి శాలసిద్ధి అని డీఈవో యాదయ్య అన్నారు. సోమవారం పట్టణంలో ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం పైలెట్ ప్రాజెక్టు కింద 31 పాఠశాలలను ఎంపిక చేసి 73 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు చౌదరి, పి.శ్రీనివాస్, హేమలత, సత్యనారాయణమూర్తి, ఆర్పీలు రాజ్‌కుమార్, సాంబమూర్తి, అర్చన, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీవైఎస్ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి

శ్రీరాంపూర్: భారత యాదవ సమితి (బీవైఎస్) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా గొర్రె తిరుపతి యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ నెల 30న నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కమిటీ సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేశ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేశ్‌యాదవ్ కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా ఎల్లనేన గంగన్నయాదవ్, మహిళా జిల్లా అధ్యక్షురాలిగా అరిగెల పద్మయాదవ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంబాల ఓదెలు ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో జరిగిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సమావేశంలో ఓదెలుతో పాటు ఏరియాకు చెందిన ఆర్. శారద, గోమాస్ ప్రవీణ్, రాజశేఖర్‌లకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించారు.

సెక్యూరిటీ గార్డుకు వీడ్కోలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసి మందమర్రి ఏరియాకు బదిలీపై వెళ్తున్న ఎస్ అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డు సుధాకర్‌ను సోమవారం అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజీముద్దీన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ చిర్ర రాజయ్య, జమేదార్ కనుకయ్య, సిబ్బంది సతీశ్‌కుమార్, తోట సతీశ్, గులాముద్దీన్, పాదం రవి, దాతు సతీశ్, జే.తిరుపతి పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలి



సమావేశంలో సూచనలు చేస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ఏరియాలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలని ఏరియా జీఎం మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా ప్రతి అధికారి, సూపర్ వైజర్ కచ్చితంగా పని స్థలాలను పరిశీలించాలన్నారు.

'కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను విధుల్లోంచి తొలగించాలి'

పాతమంచిర్యాల: తాండూరు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించాలని కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తోకల తిరుపతి సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని నాన్ టీచింగ్ వర్కర్లను వేధిస్తోందని, పిల్లలకు ఇచ్చిన సరుకులు ఇంటికి వాడుకుంటూ పలు అక్రమాలకు పాల్పడుతోందన్నారు. జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణిలో సర్వీస్ పూర్తి చేసుకుని రిటైర్డ్ అయిన పలువురు ఉద్యోగులను సోమవారం యాజమాన్యం ఆయా గనులపై ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. జీఎం కార్యాలయంలోని సర్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మనోహర్‌ను జీఎం సంజీవరెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, ఇందారం ఓపెన్ కాస్ట్ అధికారి శ్రీనివాస్, ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) రాజేశ్వరరావు, సర్వే అధికారి వెంకటేశం, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, కిరణ్ కుమార్, స్వప్న, కాంతారావు, ప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే 7 గని పై..

ఆర్కే7 గనిపై పైడి రవీందర్‌రెడ్డి (సీనియర్ మైనింగ్ సర్దార్), డీ వెంకటస్వామి (కోల్‌కట్టర్), ఆర్.మల్లయ్య (కోల్‌కట్టర్)లను గని మేనేజర్ సాయిప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రవిశంకర్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ మెండె వెంకటి, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అండర్ మేనేజర్లు వెంకట్రామ్, శ్రీనివాస్‌రాజు, సంక్షేమాధికారి సంతన్, టీబీజీకేఎస్ నాయకులు అశోక్, ప్రేమ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు కొట్టే కిషన్ రావు పాల్గొన్నారు.

ఆర్కే న్యూటెక్ గనిపై..

డి.వీరాచారి(సీనియర్ మైనింగ్ సర్దార్), ముత్యాల రావు (ఎస్‌ఓపీ), మాదాస్ తిరుపతి (టెండల్), గందం రాజయ్య (ఎంజేడబ్ల్యూ) లను గని మేనేజర్ స్వామిదాసు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఇంజనీర్ రాజగోపాలచారి, వెంటిలేషన్ అధికారి శంకర్, సర్వే అధికారి పిచ్చేశ్వరరావు, పిట్ సెక్రెటరీ జంపయ్య, సంక్షేమాధికారి పాల్‌స్రుజన్ పాల్గొన్నారు.

ఎస్సార్పీ 3, 3ఏ గనిలో..

సీనియర్ మైనింగ్ సర్దార్, లింగం పరశురామును గని మేనేజర్ సంతోష్ కుమార్ ఘనంగా సన్మానించారు. గని రక్షణాధికారి శ్రీధర్‌రావు, డెప్యూటీ మేనేజర్ చంద్రమర్కు, పిట్ ఇంజనీర్ ప్రేమ్ కుమార్, పిట్ సెక్రెటరీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీపీలో..

ఎం.వెంకట్(హెడ్ చైన్‌మెన్)ను ప్రాజెక్టు అధికారి వీ.పురుషోత్తంరెడ్డి సన్మానించారు. గని మేనేజర్ సుధీర్ జక్కుల వార్, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు డీ.అన్నయ్య, రక్షణాధికారి శ్రీనివాస్, పిట్ సెక్రెటరీ కందుల శంకరయ్య, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్‌రావు, సర్వే అధికారి సంపత్, సంక్షేమాధికారి శంకర్ పాల్గొన్నారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఖాజా నాయిమొద్దీన్, లైన్‌మెన్ ఆగయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రక్షణాధికారి సునీల్ కుమార్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీశాన్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్, మినుగు లక్ష్మీనారాయణ, రాజేందర్, ఓడ్నాల రాజన్న, భైరి శంకర్, అబ్దుల్, శ్రీనివాస్, అశోక్, రమేష్, సిబ్బంది బన్న లక్ష్మణ్‌దాస్, ఇంజనీర్లు బాబు, మధుకర్, అండర్ మెనేజర్ నిఖిల్, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీఎంఎస్ నాయకులు శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ మాట్లాడుతూ కొద్దిరోజులుగా సింగరేణి కాలనీలకు మురుగునీరు సరఫరా అవుతోందన్నారు. కలుషితమైన నీటిని తాగి కార్మిక కుటుంబాలు అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. నీటిని శుద్ధిచేసి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాదాసి భీమయ్య, పాడిశెట్టి వినోద్ కుమార్, రాకేస్, పంచర్పుల నరేష్ సందీప్, రామకృష్ణ, మహేందర్ పాల్గొన్నారు.

పెన్షన్ పెంచాలని రిటైర్డ్ ఉద్యోగుల వినతి



వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: పెన్షన్ పెంచాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. సోమవారం సీసీసీ కార్నర్‌లోని నరసయ్య భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సీతారామయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలను ఆయనకు విన్నవించారు. పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం, కోలిండియా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడితేవాలని కోరారు. నాయకులు మాట్లాడుతూ కోల్ మైన్స్ యాక్ట్ 1998 ప్రకారం మూడేళ్లకోసారి సమీక్ష చేసి పెన్షన్ పెంపుదల చేయాలని ఉన్నప్పటికీ అలా చేయడంలేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు మందుల కోసం తరచూ సింగరేణి ప్రాంతానికి రావడం ఇబ్బందిగా ఉందని హైదరాబాద్ కరీంనగర్ వరంగల్ తదితర పట్టణాల్లోనే స్థిరపడ్డ వారికోసం అక్కడే సెంటర్లు ఏర్పాటు చేసి మందులు అందించాలన్నారు. గోల్డెన్ షేక్‌హ్యాండ్ కింద దిగిపోయిన ఉద్యోగులకు కూడా కంపెనీ మందులు ఇవ్వాలన్నారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను రిటైర్డ్ ఉద్యోగులకు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి గునిగంటి నరసింహరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు మురళీధర్, సారంగచారి, వెంకటేశం, కొత్త రాజమౌళి, భోగి శంకర్, అనీఫ్ లక్ష్మీనారాయణ, కోడి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.